క్లుప్తంగా

అన్ని విషయాల్లో అవగాహన కలిగి ఉండాలి

నర్మెట: విద్యార్థులు అన్ని విషయాల్లో పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ బోడ పాటి అరవింద్ చౌదరి అన్నారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమెన్ అండ్ చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రాముఖ్యతను పవిత్ర, ప్రశాంత్ వివరించారు. అనంతరం నో బ్యాగ్ డే సందర్భంగా హెచ్ఎం నీలం వేణు ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులకు ఏఈ సుదాకర్ పవర్ ట్రాన్స్‌మిషన్ విదానాన్ని, విద్యుత్ వినియోగాన్ని, ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాలిన్న జాగ్రత్తలను, 1912 నంబర్ ఆవశ్యకతను వారికి వివరించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ జన్ను స్వామి, లైన్‌మన్ కిష్టయ్య, సురేష్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శన



జనగామ రూరల్: కోవిద ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జానపద జన జాతర కార్యక్రమంలో శనివారం ఓబుల్ కేశాపూర్ గ్రామానికి చెందిన కళాకారులు పాల్గొన్నారు. పగిడిపల్లి సుధాకర్, పంబాల కళాబృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు కూచన సుప్రీం జాజాల గోవర్దన్, కందుకూరి మనోహర్, జాజాలస్వామి, ఇమ్మడి రాజశేఖర్ ఇమ్మడి ఎల్లేష్, కాటం ప్రసాద్, పగిడిపల్లి నరేందర్, పాల్గొన్నారు.

ఆరోగ్య పరికరాల అందజేత




రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ శివసాయి స్టోన్ క్రషర్ ఆధ్వర్యంలో ఇటీవల ఫతేషాపూర్ సబ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో అనారోగ్య సమస్యలు గుర్తించిన వారికి శనివారం ఉచితంగా పరికరాలు అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన జాతీయ శ్రవణ, భాషణ దివ్యాంగుల సంస్థ, భారతీయ కృతిమ అవయవాల తయారీ సంస్థ వారు గ్రామ పెద్దలతో కలిసి చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, మెడ, నడుం బెల్టులు, చేతి కర్రలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్ గ్రామాల ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్య పరికరాలు అందజేసిన నిర్వాహకులను అభినందించారు.


యువకుడిపై దాడి

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెంలో బెల్టుషాపు వద్ద ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఈ నెల 17వ తేదీన రాత్రి సమయంలో గ్రామంలోని బెల్టుషాపు వద్ద నితీష్‌కుమార్‌పై ఎండీ ఉమేర్, ఎయాజ్, అఖిల్ అనే వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. దీంతో అదే రోజు రాత్రి నితీష్‌కుమార్ తల్లి కనకలక్ష్మి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన విషయంలో దాడి చేసిన ముగ్గురు యువకులను ఈనెల 22న పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఉమేర్ అనే వ్యక్తి ఎస్సై రామ్‌చరణ్‌నాయక్ తప్పుడు కేసు నమోదు చేసి తీవ్రంగా కొట్టారని ఆరోపిస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. దీంతో ఎస్సై రామ్‌చరణ్‌నాయక్ వివరణ ఇస్తూ ఉమేర్‌ను కొట్టలేదని, కావాలనే కొందరు వ్యక్తులు తనపై అసత్య ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. అయితే యువకుల దాడిలో తీవ్రంగా గాయపడిన నితీష్‌కుమార్ కూడా తనకు న్యాయం చేయకుండా కొందరు పెద్ద మనుషులు దాడి చేసిన వారికి మద్దతుగా నిలుస్తుండటం సమంజసం కాదంటూ సోషల్‌మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రషిత



పూజశ్రీ

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ పూజశ్రీ, ఎస్.రిషిత రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎండీ పర్వాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు పూజశ్రీ, రిషిత ఇటీవల హనుమకొండ జేఎన్ఎస్‌లో జరిగి ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 24న కొమురంభీం జిల్లాలోని గోలేటిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులతో పాటు పీడీ సాయికుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సాక్షి నెట్‌వర్క్: శ్రావణ మాసం అమావాస్య సందర్భంగా శనివారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పంచామృత అభిషేకం, జలాభిషేకం, అర్చన పూజలు చేశారు. కాగా, పలు ఆలయాల్లో దాతలు అన్నప్రసాదన వితరణ ఏర్పాటు చేశారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీమహాదేవ స్వామి ఆలయంలో జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై దూదిమెట్ల నరేష్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో పూర్ణాహుతితో శ్రావణమాస ఉత్సవాలు ముగిశాయి.



జనగామ: పోచమ్మ ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వారకల్యాణం, కొడవటూర్‌లోని స్వయంభూ శ్రీసిద్ధేశ్వరాలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి రోజు కావడంతో పోచమ్మతల్లికి భక్తులు బోనాలు చేసి సమర్పించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ రూరల్: భవిత పాఠశాలలో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో ఉన్న భవిత పాఠశాలను విద్యాశాఖ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలకు రూ.2 లక్షలతో ఆట వస్తువులను అందించగా వాటిని స్వయంగా పరిశీలించారు. అనంతరం పాఠశాలలో చేపడుతున్న ప్లాట్‌ఫామ్, సివిల్ వర్క్స్ పనులను పరిశీలించి పలు



అధికారులకు సూచనలు ఇస్తున్న పింకేశ్‌కుమార్

సూచనలు చేశారు. విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, ఏడీ మూర్తి, సీఎంఓ నాగరాజు, ఎంఈఓ శంకర్ రెడ్డి, యాదవరెడ్డి తదితరులు ఉన్నారు.

వయోజనుల అక్షరాస్యతే ‘ఉల్లాస్’ లక్ష్యం



దేవరుప్పుల: మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

- ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ విజయ్‌కుమార్

దేవరుప్పుల: వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమని ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో గ్రామాల్లో నిరక్షరాస్యులకు చదువు నేర్పడం కొరకు ఉద్దేశించిన వయోజన విద్య కార్యక్రమం ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పై విద్యాశాఖ, సెర్ప్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ఎంఈఓ జి.కళావతి అధ్యక్షతన ఒకరోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లు తిరుపతిరెడ్డి, సుహాసిని, ఐకేపీ ఎంపీఎం శోభరాణి, సీసీలు శంకర్, సోమనారాయణ, ఉమ. ఎంఐఎస్ కోఆర్డినేటర్ రవీందర్ రెడి ఉన్నారు.

నర్మెట: సంపూర్ణ అక్ష్యరాస్యతే లక్ష్యంగా ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని మండల విద్యాధికారి మడిపల్లి ఐలయ్య అన్నారు. నవభారత్ సాక్షరతా కార్యక్రమం ఉల్లాస్‌లో భాగంగా మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బడీడు పిల్లలందరినీ బడికి చేర్చే విధంగా తల్లితండ్రులను ప్రోత్సహించడంతో పాటు బాల కార్మిక వ్యవస్థను రూపుమాపితే సంపూర్ణ అక్ష్యరాస్యత సాధిస్తామని అన్నారు. ఈసందర్భంగా వీఓఏలు, రిసోర్స్ పర్సన్స్‌లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ అరవింద్ చౌదరి, టాస్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నీలం వేణు, రిసోర్స్ పర్సన్స్ పవన్ రాజ్, దామోదర్ పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను నిర్మూలించాలి

బచ్చన్నపేట: విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

లింగాలఘణపురం: 15 ఏళ్లకు పైబడిన నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ విష్ణుమూర్తి కోరారు. మండల కేంద్రంలో అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లర్నింగ్ ఫర్ ఇన్ సొసైటీ నవభారత సాక్షరత కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

జనగామ రూరల్: పట్టణంలోని ధర్మకంచ ఉన్నత పాఠశాలలో నవ భారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ శంకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాలకుర్తి: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. శనివారం మండలం తిర్మలగిరిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని గ్రామ సెక్రెటరీ హైమావతికి సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మాజీ సర్పంచ్ బక్క పుల్లయ్య, వార్డు మాజీ సభ్యులు, రైతు, ప్రజలు హాజరయ్యారు. అనంతరం



గ్రామ సభలో పాల్గొన్న ఎంపీడీఓ రవీందర్

నర్సింగాపురంలోని ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ఎంపీడీఓ పరిశీలించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

నర్మెట/బచ్చన్నపేట: సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ విధానాన్నే అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నా తిరిగి సీపీఎస్ విధానాన్నే అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలపడం శోచనీయమని, అగస్టు 23ను బ్లాక్ డేగా పాటిస్తున్నామని ఉద్యోగసంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలతో శనివారం నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అరవింద్ చౌదరి సిబ్బందితో కలిసి మండల పరిషత్ కార్యాలయం ఎదుట, ఎంఈఓ మడిపెల్లి ఐలయ్య సిబ్బందితో కలిసి ఎంఆర్‌సీ భవనం ఎదుట, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసనల అనంతరం తహసీల్దార్ ఎండీ మొహసీన్ ముజ్తాబాకు వినతి పత్రం అందజేశారు. అలాగే బచ్చన్నపేటలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల తిరుపతిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్



జనగామ: జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి.వేణుమాధవ్ అన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులతో పాటు రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సర్కిల్ పరిధిలో టెక్నికల్ డీఈ, సంబంధిత అధికారులతో కలిసి సేఫ్టీ టీంను ఏర్పాటు చేశామని, ముఖ్యంగా విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమంతో సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2,083 లూజులైన్లను పునరుద్దరించగా, 191 వంగినపోల్స్ సరి చేసినట్టు తెలిపారు. జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో భద్రత సూచనలకు సంబంధించిన హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయగా, ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన సరిచేయడం జరిగిందన్నారు. విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైతే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

‘మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం’

బచ్చన్నపేట: దినదినం మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టండంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐద్వా కార్యాలయంలో బాషెట్టి శోభ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాలానికి అనుగుణంగా మహిళలు కూడా అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి నిర్మల, కావ్య, శిరీష, సుంచు కవిత పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి

తరిగొప్పుల: పత్తిపంటలో అధిక దిగుబడి సాధించేందుకు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని ఏరువాక వ్యవసాయ కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త అనిల్ కుమార్ అన్నారు. ఎల్‌డీసీ జాగృతి, మోడర్న్ ఆర్కిటెక్ ఫర్ రూరల్ ఇండియా ఫౌండేషన్ బెటర్ కాటన్ ప్రాజెక్ట్‌లో భాగంగా లూయిస్ డ్రైఫ్రాస్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైతువేదికలో పత్తిపంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంటకు ప్రధాన శత్రువుగా మారిన గులాబీ రంగు పురుగు నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు లింగాకర్షణ బుట్టలు పంపిణీ చేశారు. శాస్త్రవేత్త శ్రీలత, మారి క్లస్టర్ కోఆర్డినేటర్ చాగంటి నరేష్, ఏఈఓలు రేష్మా, ప్రవళిక, సంస్థ ప్రతినిధులు పరుశరాములు, భీమగోని రాకేష్, ప్రేమలత, రజని, మౌనిక, స్వామి, భాస్కర్, నరేష్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

జఫర్‌గఢ్: పత్తి పంటకు ఆశిస్తున్న గులాబీబీ రంగు తెగుళ్ల నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎంతో దోహద పడతాయని గుండాల ఎల్డిసి ప్రతినిధి అఖిలేష్, జీఎల్ఓ అధికారి రీజా, మారి సంస్థ మేనేజర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తీగారం గ్రామంలోని రైతువేదికలో పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి, ఏఈఓ మహేష్, ఎల్డిసీ ప్రతినిధి అఖిలేష్, మారి సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

భక్తితోనే మానవ జన్మకు మోక్షం

బచ్చన్నపేట: భక్తితోనే మానవ జన్మకు మోక్షం లభిస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ తప్పకుండా భగవద్గీతను చదవాలని త్రైత సిద్ధాంత ప్రభోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక ఉత్సవ కమిటీ సభ్యులు కొన్నె ఉపేందర్, నాగలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. మహిళలు బిందెలతో నీళ్లు పోస్తూ మంగళహారతులతో స్వాగతించారు. విద్యార్థులు కూచిపూడి నృత్యం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జనగామ, భువనగిరి, చేర్యాల కమిటీ సభ్యులు శ్రీనాథ్, దేవేంద్ర,



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

ఉపేందర్, లింగస్వామి, యాదగిరి, శంకర్, రాజు, పాండు, లావణ్య, కవిత, నాగలక్ష్మి, లత, సావిత్రి, వాణి, రామకృష్ణ, బిషప్ తుమ్మబాల పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులు త్వరగా చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: వాటర్‌షెడ్ పథకంలో భాగంగా చేపట్టనున్న పనులను త్వరగా చేపట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వసంత అన్నారు. మండలంలోని విశ్వనాథపురం, తానేదార్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం నిర్వహించిన సమావేశాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నీటిని నిల్వ చేసే కుంటలు, చెక్ డ్యామ్‌లు, చిన్ననీటి కుంటలు, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్స్, రైతులకు పనిముట్లు తదితర పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ ప్రేమయ్య, ప్రాజెక్టు ఆఫీసర్ వీరన్న, టెక్నికల్ అసిస్టెంట్ జాంబ, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, వెంకటరమణ, సంతోష్, ఎఫ్ఏ కవిత, మంజుల పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక ‘తీజ్’ ఉత్సవాలు



తీజ్ వేడుకల్లో ఆర్డీఓ గోపీరామ్, హాథీరామ్

జనగామ రూరల్: తీజ్ ఉత్సవాలు గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని ఆర్డీఓ గోపీరాం నాయక్ అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్‌లో ధరావత్ సోమ్లు నాయక్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తీజ్ ఉత్సవాల్లో హౌజింగ్ పీడీ మాతృనాయక్, సివిల్ సప్లయిస్ అధికారి హథీరామ్ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం అధికారులను గిరిజన సంఘాల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూక్యా చందు నాయక్, లకావత్ నరేష్ నాయక్, వాసు, మూడ్ లక్ష్మణ్, గుగులోత్ లక్ష్మణ్, భానోత్ హరిలాల్, ధరావత్ భీమా, లచ్చిరాం లకావత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం ప్రజాపోరాటాలు మరువలేనివి

దేవరుప్పుల: విద్యార్థి దశ నుంచి వృద్ధాప్యం వచ్చినా తాడీత, పీడీత ప్రజానీకం కోసం సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజాపోరాటాలు మరువలేనివని పార్టీ జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సుధాకర్‌రెడ్డి అకాల మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ సీపీఐ మండల కార్యదర్శి జీడీ ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

జనగామ రూరల్: పట్టణంలోని చౌరస్తాలో సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, హమాలీలు

బాలికల స్వయం ప్రేరణ కోసమే కిచెన్ గార్డెన్లు

దేవరుప్పుల : బాలిక సాధికారత దిశలో విద్యార్థి దశలోనే బాలికలు స్వయం ప్రేరణ పొందాలనే సంకల్పంతోనే మోడల్ కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తున్నట్టు సినాప్సిస్ సీనియర్ డైరెక్టర్ కొర్లపార నరేంద్ర, నీర్మాణ్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు హరీష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సినాప్సిస్ మద్దతుతో నీర్మాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను వారు ప్రారంభించారు. వంశీ, హరీష్, సుకన్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

జనగామ రూరల్: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన నర్మెట మండలం మలక్‌పేటకు చెందిన కార్మికుడి బానోత్ రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని అతని భార్య నీలకు ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ నలవాలు స్వామి, జి.ఆంజనేయులు, వెంకట్ రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, మాచర్ల కుమారస్వామి బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి గ్రామంలో గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని సీపీఎం నాయకుడు ఎడబోయిన రవీందర్‌రెడ్డి కోరారు. శనివారం గ్రామంలోని రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నాయకులు గ్రామస్తులతో కలిసి వరినాట్లు వేసి నిరసన తెలిపారు.

‘ఉప ఎన్నికలు ఖాయం’

జనగామ: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున గెలిచి, పార్టీ పిరాయించిన ఎమ్మెల్యేలకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ నోటీసులు జారీ చేయగా, ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఆ పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రాబోయే బై ఎలక్షన్లలో అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు.

ఎరువులు బ్లాక్‌లో అమ్మితే చర్యలు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం సీఐ జానకిరామ్‌రెడ్డి తనిఖీ చేశారు. ఎరువులను బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫర్టిలైజర దుకాణాల యాజమానులను హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన ధరలకే ఎరువులు విక్రయించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

జనగామ రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమంలో జిల్లా నుంచి వివిధ సంఘాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్ అన్నారు.

మానవ మనుగడకు విద్య కీలకం

దేవరుప్పుల: మారుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగా మానవ మనుగడకు కనీస విద్య కీలకంగా మారిందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కొలిపాక భాస్కర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాశాఖ ఆదేశాల మేరకు హెల్ప్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మానసిక వికాసం పెంపొందించేందుకోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి అరుణాకర్, అధ్యాపకులు రాధిక, చైతన్య,అనురాధ, భవాని, సైదులు, నరేష్, శ్రీకాంత్, మహేష్, వెంకటేశ్వర్లు, రాపోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన ఐలోని అంజిరెడ్డిని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అంజిరెడ్డి ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పార్టీలో తాను చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేలా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అహర్నిశలు పనిచేస్తానన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యామ్నాయ ఎరువులతోనూ బహుళ ప్రయోజనాలు

దేవరుప్పుల: మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయ పంటల సాగులో ప్రత్యామ్నాయ పంటల సాగు మాదిరి ప్రత్యామ్నాయ ఎరువులతోనూ బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఏడీఏ పరశురామ్‌నాయక్ సూచించారు. శనివారం కోలుకొండ శివారులో ఓ వ్యవసాయ క్షేత్రంలో నానో యూరియా వినియోగంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బజ్జూరి దివ్య, ఏఈఓ సనా మహవీన్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధ్యతల స్వీకరణ



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్‌గా పి.వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా ఆయన తాటికొండ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా రావడం జరిగింది. కాగా, బాధ్యతలు స్వీకరించిన హెచ్ఎంను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పాలకుర్తి టౌన్: ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ జానకిరామ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో మండలంలోని వినాయక మంపాల నిర్వాహకులు, వివిధ కుల సంఘాల, ముస్లిం మత పెద్దలతో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వారికి పలు సూచనలు చేశారు. ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొడకండ్ల: గణేశ్ నవరాత్రోత్సవాలను నిబంధనలను పాటిస్తూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై చింత రాజు కోరారు. శనివారం ఉత్సవ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. విద్యుత్ తీగల కింత మండపాలను ఏర్పాటు చేయకూడదని, విద్యుత్ అనుమతి పొంది విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని, డీజే బాక్స్‌లకు అనుమతులు లేవన్నారు. ఎఎస్సై కత్తి రమేష్, పోలీస్ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

చిల్పూరు: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు వినాయక మండపాల వద్ద డీజేల వినియోగానికి అనుమతి లేదని సుప్రీం, హైకోర్టులు ఆదేశాలు జారీ చేశాయని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం మండల డీజే ఓనర్లతో నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. డీజేలు వినియోగిస్తే వాటిని స్వాధీనం చేసుకుని ఓనర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఈ నెల 28వ తేదీన నియోజకవర్గ కేంద్రంలో తలపెట్టిన పెన్షన్‌దారుల మహాగర్జన సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెర్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ మాదిగ, ఉపాధ్యక్షుడు రడపాక ఆదాం పిలుపునిచ్చారు. కూనూర్, సూరారం, ఓబులాపూర్, షాపల్లి, తమ్మడపల్లి (జి) గ్రామాల్లో పెన్షన్‌దారులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించి వారు మాట్లాడారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి

జనగామ రూరల్: మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ సమతుల్యతకు పాటుపడాలని చౌడారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాల వాడకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలోఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని పేదలకు భూమిని ఇవ్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామంలోని సర్వే నంబర్ 872లోని ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన నిరుపేదలైన ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని దళితులకు అందించాలని కోరారు. ఈ మేరకు సదరు స్థలంలో శనివారం పేద దళితులు పిచ్చి చెట్లను తొలగించి చదును చేశారు.

‘చిత్తశుద్ధి ఉంటే నిధులు తీసుకొచ్చి శంకుస్థాపనలు చేయాలి’

పాలకుర్తి టౌన్: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ హయాంలో జరిగిన పనులను శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం కాదని, ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి శంకుస్థాపలను చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలు, శ్రీనివాస్, ఎల్లయ్య, పాపారావు, నారాయణ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దండుగుల మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో నిరసన తెలిపారు. అరవింత్, అఖిల్, కమల్, రాకేష్, సతీష్, ఆనంద పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత మసురం సురేష్ ఆర్థికసాయంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో షూ పంపిణీ చేశారు. దాత సురేష్ తన జన్మదినం సందర్భంగా చదువుకున్న పాఠశాల విద్యార్థులకు చేయూతనివ్వాలనే సంకల్పంతో 50 మందికి శనివారం షూ అందజేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం చేయూతనిస్తున్న క్లబ్‌కు హెచ్ఎం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

పశువుల కాపరి మృతి

బచ్చన్నపేట: పశువులను మేపడానికి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి కొడవటూర్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాచెర్ల రామచంద్రు(62) ఓ రైతు పశువులను మేపడానికి పాక వద్దకు వెళ్లాడు. సాయంత్రం బావి వద్దకు కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా రామచంద్రు మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య వినోద గుండెపోటులో లేదా అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలి

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం ఊరూరా అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలని విజయ డెయిరీ జిల్లా చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కాసారపు ధర్మారెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ విభాగం అనుబంధ సంఘాల విస్తరణ కోసం పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.